ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5



తమిళనాడు
TAMILNADU
శుక్రవారం 19 జనవరి 2024

తెలుగువారి కీర్తి పతాక ఎన్టీఆర్

- వర్ధంతి సభలో కొనియాడిన వక్తలు

పార్టీస్, జనవరి 18: తెలుగువారి కీర్తిని విశ్వవ్యాప్తం చేసిన మహనీయుడు నందమూరి తారక రామారావు అని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక పుళల్ కావాంగరైలో తెలుగు అభిమానులు ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా గురువారం పేదలకు సహాయాలు పంపిణీ చేశారు. వేదిక ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ చిత్రపటానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఉత్తర చెన్నై పశ్చిమ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు తాళ్లూరి సురేష్, కార్యక్రమ నిర్వాహకులు జి.వెంగయ్య, లయన్ జి.మురళి, తెలుగు ప్రముఖులతో కలసి నివాళులర్పించారు. కావాంగరై ప్రాంతంలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేసిన అనంతరం తాళ్లూరి సురేష్ మాట్లాడుతూ... ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆంధ్రులచే 'అన్న' అని అభిమానంగా పిలిపించుకున్న ఎన్టీఆర్ ఆదర్శ పురుషుడని కొనియాడారు. రాష్ట్రంలో ఉన్న తెలుగు వారంతా ఎన్టీఆర్‌ను స్ఫూర్తిగా తీసుకొని హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం జి.మురళి మాట్లాడుతూ... ఎన్టీఆర్ ఒక ప్రభంజనం అని, శ్రీకృష్ణుడు, రాముడు తదితర పురాణ పురుషులను తాను నటించిన పాత్రల ద్వారా మన కళ్ల ముందుంచారని కీర్తించారు. జి.వెంగయ్య మాట్లాడుతూ... కోట్లాది మంది జన హృదయాల్లో ఎన్టీఆర్ నేటికి జీవిస్తున్నారని, తెలుగు జాతి ఔన్నత్యానికి, ఆత్మగౌరవానికి నందమూరి తారకరామారావు ప్రతీకగా నిలిచారన్నారు. మహిళలు కూడా పెద్దసంఖ్యలో తరలివచ్చి ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు.



కావాంగరై తెలుగు వారితో ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న తాళ్లూరి సురేష్ తదితరులు



శివారులో నిలిచిపోయిన వాహనాలు

రిటర్న్ జర్నీ...

నగర బాటపట్టిన జనం

- వాహనాలతో కిక్కిరిసిన రహదారులు
- 27 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్

అడయార్, జనవరి 18: సంక్రాంతి పండుగకు సొంతూర్లకు వెళ్లిన నగర వాసులు బుధవారం సాయంత్రం నుంచి నగరానికి రావడం ప్రారంభించారు. దీంతో తిరుచ్చి - చెన్నై జాతీయ రహదారిలో వాహనాలు బారులు తీరాయి. వాహనాలన్నీ ఒక్కసారిగా రావడంతో ఏకంగా 27 కిలో మీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. సంక్రాంతికి ఐదు రోజుల పాటు సెలవు రావడంతో చెన్నై నగరం దాదాపుగా ఖాళీ అయింది. నగర రోడ్లన్నీ బోసిబోయాయి. సెలవుల తర్వాత నగర వాసులు తిరిగి రాజధానికి బయలుదేరడంతో రహదారులన్నీ వాహనచోదకులతో నిండిపోయాయి. సొంతూర్లకు వెళ్లిన వారంతా ఒకే సమయంలో నగరం వైపు రావడంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమైంది. పరనూరు టోల్‌ప్లాజా వద్ద వాహనాలు ఆగిపోయాయి. ఈ టోల్ ప్లాజాలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినప్పటికీ అనేక వాహనాల్లో ఫాస్టాగ్ కార్డు పనిచేయకపోవడం, సాంకేతిక సమస్యల కారణంగా ఈ టోల్‌ప్లాజాను దాటడం వాహనచోదకులకు గగనంగా మారింది. దీంతో ప్రతి వాహనం నత్తనడకన ముందుకు వెళ్లాయి.

నేడు నగరానికి ప్రధాని

- 22వేల మంది పోలీసులతో ఐదంచెల భద్రత
- బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో నిఘా

చెన్నై, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మూడు రోజుల పర్యటన నిమిత్తమై ప్రధాని నరేంద్రమోదీ శుక్రవారం మధ్యాహ్నం నగరానికి రానున్నారు. స్థానిక వేప్పేరిలోని నెహ్రూ స్టేడియంలో ఖేలో ఇండియా పోటీలను ప్రారంభించనున్న ఆయన రెండు రోజులపాటు మదురై, రామేశ్వరం క్షేత్రాలను సందర్శించనున్నారు. ప్రధాని పర్యటనను పురస్కరించుకుని గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్ పర్యవేక్షణలో అదనపు పోలీసు కమిషనర్లు, డిప్యూటీ పోలీసు కమిషనర్లు, అసిస్టెంట్ పోలీసు కమిషనర్లు, శాంతి భద్రతలు, ట్రాఫిక్ విభాగాలకు చెందిన పోలీసు అధికారులు, సాయుధ దళం, కమెండో, ప్రత్యేక దళం అధికారులు సహా 22 వేల మంది పోలీసులు ఐదంచెల భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు. ఇప్పటికే మీనంబాక్కం విమానాశ్రయం, మెరీనాబీచ్ నేపియర్ వంతెన సమీపంలోని అడయార్ ఐఎన్ఎస్ హెలిపాడ్ ప్రాంతం, మెరీనాబీచ్ కామరాజర్ రోడ్డు నుంచి పూందమల్లి హైరోడ్డు, వేప్పేరి రహదారి, నెహ్రూ స్టేడియం, గిండి రాజ్‌భవన్ ప్రాంతాల వద్ద సాయుధ దళాలు మోహరించాయి. ఇదే విధంగా నగరంలోని లాడ్జీలు, రెస్టారెంట్లు, మేన్షన్లలో రెండు రోజులుగా పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేస్తున్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా బస చేయడానికి వస్తే తమకు ఫిర్యాదు చేయాలని లాడ్జీల యజమానులకు పోలీసులు ఆదేశించారు. నగరంలోని ప్రధాన కూడళ్లలో మఫ్టీలో పోలీసులు నిఘా వేస్తున్నారు. స్థానిక ఎగ్మూరు, సెంట్రల్, మెట్రో రైల్వేస్టేషన్లు, బ్రాడ్వే బస్టాండు వద్ద కూడా పోలీసులు కాపలా కాస్తున్నారు. అనుమానస్పదంగా సంచరించే వారిని నిర్బంధంలోకి తీసుకుని విచారణ జరిపిన తరువాతే విడిచిపెడుతున్నారు. ఇక నగరంలో డ్రోన్లు, మైక్రోలైట్ ఎయిర్ క్రాఫ్ట్‌లు, పారా గ్లైడర్లు, హాట్ ఎయిర్ బెలూన్లు ఎగురవేయకూడదని పోలీసు కమిషనర్ ఉత్తర్వు జారీ చేశారు. స్థానిక పోలీసులతో పాటు ఢిల్లీ నుంచి వచ్చిన భద్రతా దళం కూడా నగరభద్రతపై దృష్టి సారించింది. విమానాశ్రయం, నెహ్రూ స్టేడియం, ఐఎన్ఎస్ అడయార్ హెలిపాడ్ తదితర ప్రాంతాల వద్ద బాంబు స్క్వాడ్, పోలీసు జాగిలాలతో తనిఖీ చేశారు. ఇదిలా ఉండగా గురువారం సాయంత్రం 4.30 గంటలకు ప్రధానికి కల్పించనున్న భద్రతా ఏర్పాట్లకు సంబంధించి పోలీసు అధికారులు మెరీనాబీచ్ నుండి నెహ్రూ స్టేడియం వరకు ట్రయల్ రన్ కూడా నిర్వహించారు.



మదురై మాట్టుతావాని వద్ద డాగ్ స్క్వాడ్ తనిఖీలు



నెహ్రూ స్టేడియం వద్ద భద్రతా ఏర్పాట్లపై సూచనలిస్తున్న పోలీసు ఉన్నతాధికారులు

మదురైలో...

ప్రధాని మోదీ మదురై మీనాక్షి అమ్మవారి దర్శనానికి రానుండటంతో ఢిల్లీ నుంచి వచ్చిన ప్రత్యేక భద్రతా దళం అధికారులతో కలిసి స్థానిక పోలీసు ఉన్నతాధికారులు పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు. మాట్టుతావాని బస్టాండు ప్రాంతం, కలెక్టర్ కార్యాలయం, తల్లాకులం పెరుమాళ్ ఆలయం, గోరిపాళయం, మీనాక్షి ఆలయం తదితర ప్రాంతాల వద్ద బాంబ్ స్క్వాడ్, మెటల్ డిటెక్టర్లు, పోలీసు జాగిలాలతో క్షుణ్ణంగా తనిఖీలు జరిపారు.

కేంద్ర నిధులు ఏం చేస్తున్నారు...?

రాష్ట్రప్రభుత్వాన్ని ప్రశ్నించిన గవర్నర్ ● వివరాలు పంపాలంటూ లేఖ

పెరంబూర్, జనవరి 18: రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలకు కేంద్రప్రభుత్వం అందజేస్తున్న నిధులు ఏం చేస్తున్నారో చెప్పాలని గవర్నర్ ఆర్ఎన్ రవి రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. ఈ లేఖను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అన్ని శాఖల కార్యదర్శులకు పంపించారు. రాష్ట్రంలో పలు సంక్షేమ పథకాలు అమలుచేస్తుండగా, వాటిల్లో పలు పథకాలకు కేంద్రం నిధులందిస్తోంది. ఈ పథకాల అమలుకు కేంద్రం వాటా అధికమే. ఈ నేపథ్యంలో, డీఎంకే అధికారం చేపట్టినప్పటి నుంచి, కేంద్రప్రభుత్వం తగిన నిధులు ఇవ్వకుండా పక్షపాతం చూపుతోందంటూ రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు ఆరోపిస్తున్నారు. వాటిపై కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి సహా పలువురు మంత్రులు కేంద్రం అందిస్తున్న నిధుల వివరాలను లెక్కలతో సహా వెల్లడిస్తున్నారు. అదే సమయంలో, డీఎంకే నేతలు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రకటనలు గుప్పిస్తూ, రాష్ట్రప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని బీజేపీ అధిష్ఠానం భావిస్తోంది. ఈ నేపథ్యంలో, రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలకు కేంద్రప్రభుత్వం అందిస్తున్న నిధులపై గవర్నర్ దృష్టి సారించారు. ఆ క్రమంలో, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు అమలుచేస్తున్న పథకాలు, వాటికి కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల వాటా వివరాలు, పథకానికి అందించిన నిధులు, ఖర్చుపెట్టినది తదితర వివరాలు తెలపాలని రాష్ట్రప్రభుత్వాన్ని గవర్నర్ కోరారు. ఈ మేరకు రాజ్‌భవన్ నుంచి గవర్నర్ కార్యదర్శి కిర్లోష్ కుమార్ ద్వారా ఈ నెల 8న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్‌మీనాకు పంపించారు. ప్రస్తుతం పథకాల అమలుతీరును తెలియజేయాలని ఆయా శాఖల కార్యదర్శులకు సీఎస్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ వివరాలు అత్యవసరంగా పరిగణించి అధికారులు త్వరితగతిన వివరాలు పంపించాలని సీఎస్ పేర్కొన్నారు. ఇదిలా వుండగా మద్రాస్ ఐఐటీలో ఏర్పాటు చేసిన 'ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ కాంక్లేవ్'కు గురువారం వెళ్లిన గవర్నర్ ఆర్ఎన్ రవి అక్కడి విశేషాలను అడిగి తెలుసుకున్నారు.



మద్రాస్ ఐఐటీలో ఏర్పాటైన సదస్సులో గవర్నర్

డీఎంకే యువజన మహానాడు...

రిలే జ్యోతి ర్యాలీ ప్రారంభం

అడయార్, జనవరి 18: ఈ నెల 21వ సేలం వేదికగా డీఎంకే యువజన విభాగం మహానాడు జరుగనుంది. దీన్ని పురస్కరించుకుని రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖా మంత్రి ఉదయనిధి రిలే జ్యోతి ర్యాలీని గురువారం ప్రారంభించారు. స్థానిక అన్నాసాలై, సిమ్సన్ సిగ్నల్ సమీపంలో ఉన్న పెరియార్ విగ్రహం నుంచి ఈ జ్యోతిని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పీకే శేఖర్ బాబు, పార్టీ సీనియర్ నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. ఈ జ్యోతి అన్నాసాలై, సైదాపేట, పల్లావరం, తాంబరం, పెరుంగళత్తూరు, వండలూరు, ఎస్‌పీ కోయిల్, చెంగల్పట్టు, మధురాంతకం, మేల్‌మరువత్తూరు, దిండివనం, మయిలం, విల్లుపురం, ఉళుందూరుపేట, కళ్ళకుర్చి, చిన్న సేలం, తలైవాసల్ ఆత్తూరు మీదుగా ఈ నెల 20వ తేదీ మధ్యాహ్నం 1.30 గంటలకు సేలం జిల్లా పెద్దనాయకన్ పాళయంకు చేరుకుంటుంది. అక్కడ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్‌కు అందజేస్తారు. ఈ రిలే జ్యోతి ర్యాలీ మొత్తం 316 కిలోమీటర్ల మేర ప్రయాణించనుంది. ఈ రిలే జ్యోతి ర్యాలీని ప్రారంభించిన అనంతరం మంత్రి ఉదయనిధి మాట్లాడుతూ... సేలం మహానాడుకు ఏర్పాట్లు భారీ స్థాయిలో చేశామన్నారు. దాదాపు 5 లక్షల మంది యువత ఈ మహానాడుకు హాజరవుతుందని ఎదురు చూస్తున్నట్టు తెలిపారు. నీట్ నుంచి రాష్ట్రానికి మినహాయింపు కోరుతూ 50 రోజుల్లో 50 లక్షల సంతకాలు సేకరించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతుండగా ఇప్పటికే 85 లక్షల సంతకాలు చేసినట్టు వెల్లడించారు. ఈ సంతకాల జాబితాను సేల మహానాడులో సీఎం స్టాలిన్‌కు అప్పగిస్తామని తెలిపారు.



జ్యోతి ర్యాలీని ప్రారంభిస్తున్న ఉదయనిధి

యువజన మహానాడులో గవర్నర్ల రాజకీయాలకు

చరమగీతం

పార్టీ శ్రేణులకు స్టాలిన్ లేఖ



చెన్నై, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాల్లో ఎన్నికైన ప్రభుత్వాలకు వ్యతిరేకంగా గవర్నర్లు నిర్వర్తించే కుటిల రాజకీయాలకు సేలంలో జరుగనున్న డీఎంకే యువజన విభాగం మహానాడు చరమగీతం పాడనుందని ముఖ్యమంత్రి స్టాలిన్ పేర్కొన్నారు. పార్టీ యువజన మహానాడు సందర్భంగా ఆయన గురువారం పార్టీ శ్రేణులకు ఓ లేఖ రాశారు. కేంద్రంలోని బీజేపీ హరించి వేసిన రాష్ట్రాల హక్కులను సాధించటమే సేలం మహానాడు ఆశయమని స్పష్టం చేశారు. అందరికీ అభివృద్ధి ఫలాలు అనే ఏకైక నినాదంతో ద్రావిడ తరహా సామాజిక న్యాయాన్ని అందించేలా ప్రజలకు చక్కటి పాలన అందిస్తున్నామని, సంక్రాంతి సందర్భంగా ప్రజలకు నగదు కానుక, వరద బాధితులకు ఆర్థికసాయం, గృహిణులకు సాధికారిక నగదు ముందే చెల్లింపు వంటి చర్యలతో ఈ సంక్రాంతి నిరుపేదలు, బడుగు జీవుల జీవితాల్లో వెలుగులు నింపిందని, ఆ దిశగానే తాను సమత్వ పొంగల్ జరపాలని పిలుపినిచ్చానన్నారు. తన పిలుపుతో రాష్ట్ర మంతటా సమైక్యతా సంక్రాంతి వెల్లివిరిసిందన్నారు. ఈ నేపథ్యంలో సేలంలో జరుగనున్న డీఎంకే యువజన మహానాడుకు కార్యకర్తలంతా తరలిరావాలని, ఆ మహానాడు దేశ చరిత్రలో కొత్త మలుపు సృష్టించబోతున్నదని, మతతత్త్వ బీజేపీ పాలనకు చరమగీతం పాడనుందని తెలిపారు. పదేళ్ల బీజేపీ పాలనలో అన్ని రాష్ట్రాలు హక్కులను కోల్పోయాయని, విద్యాహక్కు, భాషా హక్కు, ఆర్థిక హక్కు, న్యాయపరమైన హక్కు వంటి కీలకమైన హక్కులన్నింటిని కేంద్రం హరించి వేసిందని ఆరోపించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలైన ప్రభుత్వ పాలనకు అడుగడుగునా అడ్డుకట్ట వేసేలా గవర్నర్లతో పోటీ ప్రభుత్వాన్ని నడిపిస్తున్న నిరంకుశధోరణి రాష్ట్రాలకే కాకుండా భారత రాజ్యాంగ ధర్మాసనానికే విరుద్ధమన్నారు. ఏ మాత్రం అర్హతలేని వ్యక్తులను గవర్నర్ పదవులు అప్పగించి వారి చేత చౌకబారు రాజకీయాలు నడిపిస్తుండడాన్ని డీఎంకే ఎన్నడూ సహించదని, ఆధ్యాత్మిక భావాలను రాజకీయం చేసి మతోన్మాదాన్ని రెచ్చగొట్టి, హిందీ, సంస్కృత భాషలకు పట్టం గట్టి తమిళంతో సహా ఇతర భాషలను నాశనం చేసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, ఆ ప్రయత్నాలన్నింటినీ తిప్పికొట్టగల శక్తిసామర్థ్యాలు డీఎంకేకు మాత్రమే వున్నాయని స్టాలిన్ పేర్కొన్నారు.

పళని సమీపంలో పట్టాలపై పగుళ్లు

- పాలక్కాడు రైలుకు తప్పిన ముప్పు

చెన్నై, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ - పాలక్కాడు మార్గంలో గురువారం ఉదయం వెళ్తున్న రైలుకు పెనుముప్పు తప్పింది. పళని సమీపంలో పట్టాలపై ఉన్న పగుళ్లను గుర్తించిన లోకోపైలట్ రైలు నిలిపివేయడంతో ప్రయాణికులకు ప్రమాదం తప్పింది. దిండుగల్ నుంచి ఒట్టన్‌సత్తిరం, పళని మీదుగా పాలక్కాడు వరకు రోజూ నాలుగు రైళ్లు నడుస్తుంటాయి. ఈ మార్గంలో మదురై నుంచి కోయంబత్తూరు, తిరువనంతపురం నుంచి మదురై వెళ్లే అమృత ఎక్స్‌ప్రెస్, చెన్నై నుంచి పళని వెళ్లే ఎక్స్‌ప్రెస్, తిరుచెందూరు - పాలక్కాడు ఎక్స్‌ప్రెస్‌లు నడుస్తుంటాయి. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం పాలక్కాడు నుంచి దిండుగల్ బయలుదేరిన రైలు పళని స్టేషన్ దాటి ఒట్టన్‌సత్తిరం వైపు కామాక్షిపురం ప్రాంతంలో వెళ్తుండగా పట్టాలపై పగుళ్లను డ్రైవర్ గమనించారు. ఆ పట్టాలపై వెళ్తున్న రైలు శబ్దం తేడాగా ఉండడంతో వెంటనే ఆయన రైలు నిలిపివేసి ఉన్నతాధికారులకు సమాచారమిచ్చారు. వెంటనే రైల్వే సాంకేతిక సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకుని పరిశీలించగా ఓ పట్టా విరిగి ఉండటం గమనించారు. వెంటనే అక్కడ తాత్కాలిక మరమ్మతులు చేపట్టగా, ఆ రైలు నెమ్మదిగా బయలుదేరింది. లోకోపైలట్ పట్టాలపై పగుళ్లను సకాలంలో గుర్తించడంతో 500 మంది ప్రయాణికులకు పెనుముప్పు తప్పిందని రైల్వే ఉన్నతాధికారులు పేర్కొన్నారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.



పట్టాలను మరమ్మతు చేస్తున్న రైల్వే సిబ్బంది

సమాచార దృశ్యిని

నేటినుంచి పళనిలో తైపూసం ఉత్సవాలు

ప్యారీస్, జనవరి 18: దిండుగల్ జిల్లాలో ప్రసిద్ధిచెందిన పళని దండాయుధపాణి ఆలయంలో తైపూసం ఉత్సవాలు శుక్రవారం ధ్వజారోహణంతో ప్రారంభం కానున్నాయి. కొండపై కొలువుదీరిన దండపాణి స్వామివారి తైపూసం ఉత్సవాలు ఈ నెల 28వ తేది వరకు నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన రథోత్సవం 25వ తేది జరుగనుంది. తైపూసం ఉత్సవాలు పెరియనాయకి అమ్మవారి సన్నిధిలో శుక్రవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమవుతాయి. 8.30 గంటలకు శివాచార్యులు ధ్వజస్తంభంపై ప్రత్యేకంగా రూపొందించిన పతాకాన్ని ఆవిష్కరిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు కొండ శిఖరంపై ఉన్న ఆలయంలో విఘ్నేశ్వరుడు, మూలవర్ దండయుధపాణి, షణ్ముగర్, ద్వారపాలకులకు విశేషపూజలు నిర్వహిస్తారు.

డిప్లొమో, టైప్ రైటింగ్ పాఠ్యాంశాల్లో మార్పులు

ఐసిఎఫ్, జనవరి 18: వచ్చే విద్యా సంవత్సరం నుంచి డిప్లొమో, టైప్ రైటింగ్ కోర్సులకు కొత్త పాఠ్య ప్రణాళిక పరిచయం చేయాలని సాంకేతిక విద్య డైరెక్టరేట్ నిర్ణయించింది. రాష్ట్రంలో ఆర్ట్స్, ఇంజనీరింగ్ కోర్సులకు ఒక్కో సంవత్సరం పాఠ్యాంశాల్లో మార్పులు చేపట్టేందుకు వర్సిటీలు అధికారాన్నిచ్చాయి. ఆ ప్రకారం, డిప్లొమో ఇంజనీరింగ్, టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్ కోర్సులు నిర్వహించే సాంకేతిక విద్య డైరెక్టరేట్ పాఠ్యాంశాల్లో మార్పులు చేపడుతోంది. ఈ కొత్త పాఠ్యాంశాలు మార్చిలో జరిగే పరీక్షల నుంచి అమలుకు వస్తాయని అధికారులు తెలిపారు.

స్నాతకోత్సవాల్లో చేనేత వస్త్రాలు

ఐసిఎఫ్, జనవరి 18: చేనేత పై అంగీలను స్నాతకోత్సవాల్లో వినియోగించాలని విశ్వవిద్యాలయాలకు యూజీసీ సూచించింది. ఈ మేరకు యూజీసీ విడుదల చేసిన ప్రకటనలో... చేనేత దుస్తులు ధరించడం దేశ ఉష్ణోగ్రతలకు అనుకూలంగా ఉంటుందని, వర్సిటీ, కళాశాలల్లో జరిగే స్నాతకోత్సవాల్లో ఈ దుస్తులు ధరించేందుకు పరిశీలించాలని పేర్కొంది. అంతేకాకుండా, ఈ విధానాన్ని పాటించడం వల్ల చేనేత కార్మికులకు ఉపాధి కల్పించే వారమవుతామని వెల్లడించింది.

21న క్విజ్ పోటీలు

ఐసిఎఫ్, జనవరి 18: 'భారత దేశంలో ఎన్నికలు' అనే పేరుతో ఈ నెల 21వ తేది ఉదయం 11 నుంచి క్విజ్ పోటీలు జరుగనున్నాయి. ఎన్నికల విధానాల్లో ఓటర్లు పాల్గొనడాన్ని పెంచే ఉద్దేశంతో 14వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని స్వీప్ పథకంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించనున్న ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు https://www.erolls.tn.gov.in/Quiz 2024/ అనే వెబ్‌సైట్‌లో తమ పేరు, వివరాలు నమోదుచేసుకోవాలి. ఇతర వివరాలకు 1800 4252 1950 అనే నెంబరు సంప్రదించాలని కార్పొరేషన్ తెలిపింది.

26 నుంచి చెస్ పోటీలు

ఐసిఎఫ్, జనవరి 18: శివారు ప్రాంతమైన కిళంబాక్కం సిరుచ్చేరి సిప్కాట్ చెన్నై మేథమ్యాటిక్స్ ఇన్‌స్టిట్యూట్‌లో ఈ నెల 26వ తేది ఓపెన్ ఫిడే రేటింగ్ ర్యాపిడ్ చెస్ పోటీలు ప్రారంభం కానున్నాయి. మొదటి రోజు 5 రౌండ్లు, రెండవ రోజు 4 రౌండ్లు జరుగనున్నాయి. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 23లోగా 8072314881 నెంబరుకు సంప్రదించి పేర్లు నమోదుచేసుకోవాలని లోటస్ చెస్ అకాడమీ తెలిపింది.

మొబైల్ నెంబరు రెన్యువల్‌కు క్యూఆర్ కోడ్

ఐసిఎఫ్, జనవరి 18: విద్యుత్ కనెక్షన్‌లో మొబైల్ నెంబరు రెన్యువల్ చేసేందుకు, మార్చేందుకు రాష్ట్ర విద్యుత్ బోర్డు క్యూ ఆర్ కోడ్‌ను పరిచయం చేసింది. వినియోగదారుల సౌకర్యార్థం విద్యుత్ బోర్డు వివిధ చర్యలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో, విద్యుత్ కనెక్షన్ పొందే సమయంలో ఇచ్చిన మొబైల్ నెంబరు రెన్యువల్ చేసుకోవడానికి, కొత్త నెంబరు నమోదుకు క్యూ ఆర్ కోడ్ పరిచయం చేసింది. దీని ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపు, ఫిర్యాదు చేసే సౌకర్యం కూడా పొందవచ్చని అధికారులు సూచించారు.

నేడు, రేపు తాగునీటి సరఫరా నిలిపివేత

ఐసిఎఫ్, జనవరి 18: స్థానిక రెట్టేరి జంక్షన్‌లో పైప్ లైన్ అనుసంధాన పనులు చేపట్టడంతో నగరంలోని ఐదు మండలాల్లో తాగునీటి సరఫరా శుక్ర, శనివారాలు నిలిపివేస్తున్నట్లు చెన్నై మెట్రోవాటర్ బోర్డు తెలియజేసింది. పనులు పూర్తయ్యే వరకు మాధవరం, తిరువికనగర్, అంబత్తూర్, అన్నానగర్, తేనాంపేట, కోడంబాక్కం మండలంలోని ప్రాంత వాసులను ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామని, అత్యవసర సేవలకు బోర్డు వెబ్‌సైట్ సంప్రదించాలని అధికారులు సూచించారు.

48 రైల్వేస్టేషన్లలో సీసీ కెమెరాలు

ఐసిఎఫ్, జనవరి 18: చెన్నై సెంట్రల్, కొరుక్కుపేట సహా 48 రైల్వేస్టేషన్లలో సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేసే పనులు జరుగుతున్నాయి. దక్షిణ రైల్వేలో చెన్నై సహా అన్ని రైల్వే డివిజన్లలోని ప్రధాన స్టేషన్లలో కెమెరాలు అమర్చాలని నిర్ణయించారు. ఈ విషయమై చెన్నై రైల్వే డివిజన్ అధికారులు మాట్లాడుతూ... తమ డివిజన్‌లో 48 రైల్వేస్టేషన్లలో ప్రారంభమైన కెమెరాల ఏర్పాటు పనులు జూన్‌లో పూర్తవుతాయని, ఒక్కో స్టేషన్‌లో 10 నుంచి 25 కెమెరాలు అమర్చుతున్నామని పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ...

రాష్ట్రవ్యాప్తంగా 2,000 ప్రభుత్వ పాఠశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. పాఠశాల విద్య పాఠ్యప్రణాళికలో 35,000లకు పైగా ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత, మహోన్నత పాఠశాలలున్నాయి. వీటిలో టెన్త్, ప్లస్ టూ వరకు పాఠాలు బోధించే ఉన్నత, మహోన్నత పాఠశాలలు 4,282 ఉన్నాయి. వీటిలో ఇదివరకే హైటెక్ ల్యాబ్‌లు ఏర్పాటుచేశారు. త్వరలో కెమెరాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టిన విద్యాశాఖ, తొలివిడతగా 2 వేల పాఠశాలల్లో కెమెరాలు ఏర్పాటు పనులు జూన్‌లోపు పూర్తికానున్నాయని అధికారులు తెలిపారు.

తిరుప్పోరూరులో 20న అన్నదానం

చెన్నై, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా తిరుప్పోరూరు కందసామి ఆలయంలో ఈ నెల 20 తైమాస కృత్తిక సందర్భంగా రోజంతా అన్నదానం చేస్తున్నట్లు హిందూ దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు తెలిపారు. నుంగంబాక్కంలో దేవాదాయ శాఖ కార్యాలయంలో గురువారం ఉదయం అధికారులతో ఆయన సమావేశమై రాష్ట్రంలోని శైవ క్షేత్రాల్లో తైమాస కృత్తిక, తైపూసం. మహాశివరాత్రి, సుబ్రహ్మణ్యస్వామి దివ్యక్షేత్రాల తీర్థయాత్ర, రామేశ్వరం - కాశీ ఆధ్యాత్మిక యాత్ర తదితర అంశాలపై అధికారులతో ఆయన చర్చలు జరిపారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెంగల్పట్టు జిల్లా తిరుప్పోరూరు కందసామి ఆలయంలోని కల్యాణమండపంలో శుక్రవారం సాయంత్రం నుంచి 20వ తేదీ రాత్రి వరకూ తైమాస కృత్తిక వేడుకలు వైభవంగా జరుగుతాయని తెలిపారు. అక్కడ స్వామివారు కొలువైన ఆరు దివ్యక్షేత్రాలకు సంబంధించిన నమూనా సెట్టింగ్ స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. తై కృత్తిక సందర్భంగా ఈ నెల 20న రోజంతా ఆ ఆలయానికి వచ్చే భక్తులందరికీ అన్నదానం చేయనున్నట్లు వెల్లడించారు. గతేడాది రాష్ట్రంలోని ఐదు శివాలయాల్లో మహాశివరాత్రి వేడుకలను వైభవంగా నిర్వహించామని, ఈ యేడాది అదనంగా మదురై, తిరువానైక్కావల్ లో మార్చి ఎనిమిదిన శివరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

న్యాయస్థానాలకు ఆలయ ఆస్తుల పర్యవేక్షణ బాధ్యత

● హైకోర్టు మదురై బెంచ్

పెరంబూర్, జనవరి 18: ఆలయాలకు సొంతమైన ఆస్తులు రక్షించాల్సిన బాధ్యత న్యాయస్థానం, దేవాదాయ శాఖ, జిల్లా కోర్టులకు ఉందని హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ ఉత్తర్వులు జారీచేసింది. నగరానికి చెందిన రాధాకృష్ణన్ హైకోర్టు మదురై డివిజన్ బెంచ్‌లో దాఖలుచేసిన పిటిషన్‌లో... కరూర్ జిల్లాలోని పలు ఆలయాలకు చెందిన ఆస్తులను కొందరు ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించుకున్నారని, ఆక్రమణలు తొలగించి ఆస్తులు స్వాధీనం చేసుకునేందుకు ఆలయ అధికారులు చర్యలు చేపట్టలేదని, ఆలయాల ఆస్తులు కాపాడేలా చర్యలు చేపట్టాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్‌ను బుధవారం న్యాయమూర్తి పి.పుహళేంది విచారించగా ప్రభుత్వం తరఫున హాజరైన న్యాయవాది... శాంతి భద్రతల సమస్య పరిగణలోకి తీసుకొని ఆక్రమణదారులపై చర్యలు చేపట్టాలని ఉత్తర్వులు జారీచేసినప్పటికీ ఆక్రమణలు తొలగించేందుకు ఆలయ నిర్వాహకులు చర్యలు చేపట్టడం లేదని వివరించారు. ఈ నేపథ్యంలో ఎక్కువ జిల్లాల్లో న్యాయ కోర్సులు పూర్తి చేసిన వారు ఆలయ కార్యనిర్వహణ అధికారులుగా ఉన్నారని, కానీ దురదృష్టవశాత్తు ఆలయ ఆస్తులు కాపాడాలని ఓ భక్తుడు న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొందని న్యాయమూర్తి విచారం వ్యక్తం చేశారు. 'దేవుడు మైనర్' అందువల్ల ఆలయాలకు సొంతమైన ఆస్తులు రక్షించాల్సిన బాధ్యత న్యాయస్థానం, దేవాదాయ శాఖ, జిల్లా కోర్టులకు ఉందన్నారు. శాంతి భద్రతల సమస్యలు కారణంగా ఆక్రమణలు తొలగింపులో ఇబ్బందులు ఏర్పడుతున్నాయనే వాదనకు ప్రత్యామ్నాయంగా ఆలయ స్థలాలు స్వాధీనం చేసుకొనేందుకు దేవాదాయ శాఖ జిల్లా నిర్వాహకులకు సహకరించాలని కోరారు. అందుకు రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులకు తగిన సూచనలు, సలహాలు కలెక్టర్లు అందించాలని న్యాయమూర్తి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రద్దీలో తప్పిపోయిన చిన్నారులు.. రక్షించిన పోలీసులు

పెరంబూర్, జనవరి 18: కానుం పొంగల్ సందర్భంగా రద్దీలో తప్పిపోయిన 27 మంది చిన్నారులను పోలీసులు రక్షించి వారి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ మేరకు నగర పోలీసు కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో... కానుం పొంగల్ సందర్భంగా మెరీనా, ఎలియట్స్ బీచ్, ఐల్యాండ్ గ్రౌండ్స్ సహా పర్యాటక ప్రాంతాల్లో సుమారు 17,000 మంది పోలీసులతో పహరా ఏర్పాటు చేశారు. రద్దీలో పిల్లలు తప్పిపోకుండా ఉండేలా ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. అయినా, మెరీనా, ఎలియట్స్ బీచ్ ప్రాంతాల్లో రద్దీలో తల్లిదండ్రుల నుంచి విడిపోయిన పిల్లలను ఆయా ప్రాంతాల్లో మఫ్టీలో ఉన్న పోలీసులు రక్షించి వారి తల్లిదండ్రులకు అప్పగించినట్లు పోలీసు శాఖ తెలియజేసింది.

ఎయిడెడ్ పాఠశాలల్లోనూ అల్పాహార పథకం ?

పెరంబూర్, జనవరి 18: ప్రభుత్వ నిధులు పొందుతున్న పాఠశాల (ఎయిడెడ్ స్కూళ్ల)లకు అల్పాహారం పథకం విస్తరణ అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందని పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ తెలిపారు. నగరంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ... అధిక సంఖ్యలో ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తుందని, నిధుల పరిస్థితిని పరిగణలోకి తీసుకొని ఖాళీ పోస్టుల భర్తీ చేపట్టనున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ బోధన, పాఠశాలలు పరిశుభ్రంగా ఉంచడం తదితరాలపై దృష్టి సారించినట్లు మంత్రి తెలిపారు.

ఎద్దులు విడిచే పోటీలపై నిషేధం

పెరంబూర్, జనవరి 18: పుదుకోట జిల్లాలో ఎద్దులను విడిచే పోటీలకు నిషేధం విధించినట్లు జిల్లా కలెక్టర్ ఓ ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి సందర్భంగా డెల్టా జిల్లాల్లో జల్లికట్టు, రెక్లా, ఎద్దులు విడిచే పోటీలు నిర్వహించడం ఆనవాయితీ. గత ఏడాది పుదుకోట జిల్లాలో నిర్వహించిన ఎద్దులు విడిచే పోటీల్లో ఎద్దులు కుమ్మి ఒక పోలీసు సహా నలుగురు మృతిచెందారు. అలాగే, ఈ ఏడాది సంక్రాంతి సందర్భంగా బుధవారం శివగంగ జిల్లాలో నిర్వహించిన పోటీలో ఎద్దులు కుమ్మి 13 ఏళ్ల బాలుడు సహా ఇద్దరు మృతి చెందారు. ఈ ఘటనపై స్పందించిన పుదుకోట జిల్లా యంత్రాంగం, ఈ ఏడాది జిల్లాల్లో ఎద్దులు విడిచే పోటీలకు నిషేధం విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఉత్తర్వులు ఉల్లంఘించి పోటీలు నిర్వహిస్తే కేసులు నమోదుచేస్తామని కలెక్టర్ హెచ్చరించారు.

కంచి ఆలయవేడుకల్లో అపశ్రుతి

వడకలై, తెన్‌కలై కొట్లాట ● చితకబాదుకున్న పండితులు


పరస్పరం దాడులకు పాల్పడుతున్న పండితులు

చెన్నై, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం వరదరాజస్వామి వారి ఆలయ వేడుకల్లో ఇరువర్గాలకు చెందిన బ్రాహ్మణులు ప్రబంధ గానం చేసే విషయమై గొడవపడ్డారు. ప్రబంధాన్ని తామే ముందుగా పాడాలని వడకలై వర్గానికి చెందిన పండితులు, అదంతా కుదరదు మీకంటే మేమే ముందుగా పాడతామంటూ తెన్‌కలై వర్గానికి చెందిన పండితులు గొడవకు దిగారు. అష్టోత్తర శత వైష్ణవ దివ్యదేశాల్లో ఒకటిగా కాంచీపురం వరదరాజ స్వామి ఆలయం పేరుగడించింది. ఆ ఆలయంలో అత్తివరదర్ వేడుకలు జరిగిన తర్వాత అంతర్జాతీయంగా ఖ్యాతి పొందింది. ఈ నేపథ్యంలో పశువుల పండుగ సందర్భంగా వరదరాజస్వామి అద్దాల పల్లకీలో వాలాజాబాద్ సమీపంలో ఉన్న పళయశీవరం గ్రామానికి వేంచేశారు. ఆ సందర్భంగా పార్వేట ఉత్సవాన్ని పండితులంతా కలిసి నిర్వహించారు. తర్వాత స్వామివారిని కీర్తిస్తూ ప్రబంధం ఆలపించేందుకు పండితులు సిద్ధమయ్యారు. ముందుగా తామే పాడతామంటూ వడకలై వర్గానికి చెందిన పండితులు చెప్పారు. ససేమిరా కుదరదు మేమే పాడతామంటూ తెన్‌కలై పండితులు వాగ్వాదానికి దిగారు. అంతే క్షణాల్లో ఆ ప్రాంతమంతా అరుపులు కేకలతో దద్దరిల్లింది. చివరగా రెండు వర్గాలకు చెందిన పండితులు ముష్టి యుద్ధానికి దిగారు. ఈ సంఘటనలో కొందరు తీవ్రంగా గాయపడ్డారు. దానికి సంబంధించిన వీడియో ఒకటి ప్రస్తుతం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది.

పోలీసుల కోసం క్యాన్సర్ అవగాహనా శిబిరం


కార్యక్రమంలో ప్రసంగిస్తున్న డాక్టర్ ఎస్.విజయరాఘవన్

వేళచ్చేరి, జనవరి 18: స్థానిక తాంబరం పరిధిలోని పోలీసు సిబ్బందికి 'ప్యాటర్సన్ క్యాన్సర్ సెంటర్' ఆధ్వర్యంలో అవగాహనా శిబిరం జరిగింది. 250 మందికి పైగా పాల్గొన్న ఈ శిబిరంలో క్యాన్సర్ అంటే ఏమిటి? దానిని ముందుగా పసిగట్టడం, నివారణ పద్ధతుల పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి తాంబరం పోలీసు కమిషనర్ డాక్టర్ అమల్‌రాజ్ ముఖ్య అతిథిగా హాజరు కాగా, ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.విజయరాఘవన్ తదితరులు పాల్గొని అవగాహన కల్పించారు. 'క్యాన్సర్ రహిత సమాజం' అందరికీ లక్ష్యం కావాలని ఈ సందర్భంగా ప్రముఖులు పిలుపునిచ్చారు.

నేడు రవాణా కార్మిక సంఘాలతో చర్చలు

పెరంబూర్, జనవరి 18: రవాణా కార్మిక సంఘాల ప్రతినిధులతో శుక్రవారం చర్చలు జరుపనున్నట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు. మాజీ ఉద్యోగులకు డీఏ పెంపు సహా 6 అంశాల కోర్కెల సాధనకు ఈ నెల 9వ తేది రవాణా సంస్థ కార్మికులు నిరవధిక సమ్మె చేపట్టిన విషయం తెలిసిందే. ఈ సమ్మెలో సీఐటీయూ, అన్నా కార్మిక సంఘం సహా 14 సంఘాలు పాల్గొనగా, డీఎంకేకు చెందిన కార్మిక సంఘం, ఐఎన్‌టీయూసీ సంఘాలు సమ్మెలో పాల్గొనలేదు. సమ్మెపై స్టే విధించాలంటూ దాఖలైన ప్రజావ్యాజ్యాన్ని మద్రాసు హైకోర్టు విచారించి, పండుగల దృష్ట్యా ప్రజల సౌకర్యార్థం సమ్మె విరమించుకోవాలనే సూచనతో కార్మిక సంఘాలు సమ్మెను తాత్కాలిక విరమించాయి. అదే సమయంలో కార్మిక సంఘాలు చర్చలు చేపడతామని రాష్ట్ర ప్రభుత్వం తరఫున హైకోర్టుకు తెలియజేశారు. ఈ నేపథ్యంలో, అంబత్తూర్‌లోని తమిళనాడు విద్యా భవనంలో శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు చర్చలు జరుపనున్నట్లు అధికారులు ప్రకటించారు. నగరంలో శుక్రవారం ప్రధాని మోదీ పర్యటన దృష్ట్యా, అంబత్తూర్‌లో చర్చలు జరుపనున్నట్లు, ఈ చర్చల్లో రవాణా కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొనాలని లేఖలు రాసినట్లు అధికారులు తెలిపారు.



చెన్నై టి.నగర్‌లో వున్న శ్రీవారి ఆలయంలో జరుగుతున్న 'శ్రీ రామజన్మ భూమి క్షేత్ర ప్రాణ ప్రతిష్ఠ' వేడుకల్లో గురువారం సాయంత్రం నృత్యప్రదర్శన ఇచ్చిన ప్రముఖ కళాకారిణి, పద్మభూషణ్ డాక్టర్ పద్మా సుబ్రమణ్యంను సత్కరిస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి దంపతులు, టీటీడీ స్థానిక సలహామండలి అధ్యక్షుడు ఏజే శేఖర్

తిరుమంగళం మెట్రో రైల్వేస్టేషన్ పార్కింగ్ మూత

పెరంబూర్, జనవరి 18: స్థానిక తిరుమంగళం మెట్రోరైల్వేస్టేషన్ ప్రాంగణంలోని పార్కింగ్‌ను మూసివేస్తున్నట్లు చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) ఒక ప్రకటనలో తెలిపింది. ఈ పార్కింగ్ స్థలంలో వాహనాలు అధికం కావడంతో మరో అంతస్తు నిర్మించే పనులు చేపట్టనుండడంతో శనివారం నుంచి రెండు నెలలు పార్కింగ్ స్థలాన్ని మూసివేస్తున్నట్లు సీఎంఆర్ఎల్ తెలిపింది.

116 ఏళ్లనాటి వాటా పత్రం ఆవిష్కరణ



వీఓసీ షిప్పింగ్ కంపెనీకి చెందిన వాటా పత్రం

ప్యారీస్, జనవరి 18: స్వాతంత్ర్య సమరయోధుడు వీఓ చిదంబరనార్ స్వదేశీ స్టీమ్ షిప్ పంపిణీకి చెందిన 116 ఏళ్ల వాటా పత్రం తన వద్ద ఉందని కొల్‌కతాకు చెందిన ఓ ప్రొఫెసర్ వెబ్‌సైట్‌లో ఆవిష్కరించారు. ఈ షేర్ సర్టిఫికెట్ పత్రం చారిత్రక ప్రాధాన్యత కలిగినది కావడం గమనార్హం. స్వాతంత్ర్య పోరాట సమయంలో బ్రిటీష్ పాలకులను దేశం విడిచి వెళ్లిపోవాలంటూ పోరాడిన మహాయోధుడు వీఓ చిదంబరనార్, ఈస్టిండియా కంపెనీ వాణిజ్య సంస్థలకు ధీటుగా 1906లో స్వదేశీ నౌకను నడిపి షిప్పింగ్ కంపెనీ ప్రారంభించారు. ఆ కంపెనీ షేర్ సర్టిఫికెట్లు అప్పట్లోనే వాణిజ్య సంస్థల నుంచి మంచి గుర్తింపు వచ్చింది. జోరుగా వాటాలు కూడా అమ్ముడుకాగా, వాటికి సంబంధించి బంధాలు మాత్రమే ప్రస్తుతం మనుగడలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో, వందేళ్ల చరిత్ర కలిగిన పురాతన పత్రాలు సేకరిస్తున్న కొల్‌కతాకు చెందిన ప్రొఫెసర్ అగతోష్‌కల్లోసివిల్ చిదంబరనార్ స్వదేశీ స్టీమ్ షిప్‌కు సంబంధించిన 116 ఏళ్లనాటి షేర్ సర్టిఫికెట్ తన దగ్గర ఉందని, అది సిట్కాజీకి చెందిన స్వామినాథ మొదలియార్, నాగలింగం పిళ్లైలకు చెందినదని మీడియాకు తెలిపారు.

800 గ్రంథాలయాలకు సొంత భవనాలు

పెరంబూర్, జనవరి 18: రాష్ట్రంలో తొలివిడతగా 800 గ్రంథాలయాలకు రూ.130 కోట్లతో నూతన భవనాలను నిర్మించనున్నారు. రాష్ట్రంలోని 32 జిల్లాల్లో గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో 4,658 గ్రంథాలయాలు పనిచేస్తున్నాయి. వీటిలో తొలివిడతగా 800 గ్రంథాలయాలకు కొత్త భవనాలు నిర్మించాలని నిర్ణయించారు. భవన నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వం రూ.100 కోట్లు అందజేసిందని, మార్చిలో భవన నిర్మాణాలు ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

23న వాహనాల వేలం

ఐసిఎఫ్, జనవరి 18: పోలీసు శాఖ వినియోగించిన పాత వాహనాలను ఈ నెల 23వ తేది ఉదయం 10 గంటలకు ఎగ్మూర్, మదురై, తంజావూరు సీబీసీఐడీ కార్యాలయాల్లో వేలం వేయనున్నట్లు అధికారులు తెలిపారు. వేలంలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు గుర్తింపు కార్డు, జీఎస్టీ రిజిస్ట్రేషన్ నెంబరుతో డిపాజిట్‌గా రూ.2,000 చెల్లించి పేరు నమోదుచేసుకోవాలని సూచించారు. వివరాలకు 9384847273 నెంబరును సంప్రదించవచ్చని తెలిపారు.

ఈపీఎస్ బహిరంగ సభ వాయిదా

పెరంబూర్, జనవరి 18: దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎంజీఆర్ 107వ జయంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా బహిరంగ సభలు నిర్వహించాలని అన్నాడీఎంకే పిలుపునిచ్చింది. ఉత్తర చెన్నై పరిధిలోని ఆర్కే నగర్ శాసనసభ నియోజకవర్గంలో శుక్రవారం జరిగే బహిరంగ సభలో పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి పాల్గొంటారని ప్రకటించింది. ఈ నేపథ్యంలో, అనివార్య కారణాలతో ఈ సభను 31వ తేదీకి వాయిదావేస్తున్నట్లు ఆ పార్టీ గురువారం ప్రకటన విడుదల చేసింది.

చేపల వేటకు రామనాథపురం జాలర్లకు నిషేధం

పెరంబూర్, జనవరి 18: రామనాథపురం జిల్లా జాలర్లు శని, ఆదివారాల్లో చేపల వేటకు వెళ్లేందుకు మత్స్యశాఖ నిషేధం విధించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పర్యటన సందర్భంగా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా జాలర్లు చేపల వేటకు వెళ్లడంపై నిషేధం విధించినట్లు అధికారులు తెలిపారు.

24న విజయకాంత్ చిత్రపటావిష్కరణ

పెరంబూర్, జనవరి 18: స్థానిక కోయంబేడు సమీపంలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఈ నెల 24వ తేది దివంగత పార్టీ అధ్యక్షుడు విజయకాంత్ చిత్ర పటావిష్కరణ జరుగనుంది. సాయంత్రం 4 గంటలకు జరుగనున్న ఈ కార్యక్రమానికి పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొనాలని పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమలత ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

కొత్త మైదానంలో జల్లికట్టు పోటీలు

పెరంబూర్, జనవరి 18: మదురై జిల్లా కీళక్కరైలో కొత్త జల్లికట్టు మైదానంలో నిర్వహించనున్న పోటీలో పాల్గొనదలచని వారు శుక, శనివారాల్లో పేర్లు నమోదుచేసుకోవచ్చు. కొత్త జల్లికట్టు మైదానాన్ని ఈ నెల 24వ తేది ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించనున్నారు. కొత్త మైదానంలో ప్రభుత్వ నిబంధనలు అనుసరించి తొలి జల్లికట్టు పోటీ నిర్వహించనున్నట్లు, ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు, ఎద్దుల యజమానులు తమ పేర్లు నమోదుచేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.

రాష్ట్ర ఎన్నికల కమిటీని ప్రకటించిన కాంగ్రెస్

పెరంబూర్, జనవరి 18: కేఎస్ అళగిరి నేతృత్వంలో ఎన్నికల కమిటీని కాంగ్రెస్ అధిష్ఠానం ప్రకటించింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ అళగిరి నేతృత్వంలోని ఈ కమిటీలో పి.చిదంబరం, సెల్వ పెరుందగై, తంగబాలు, ఈవీకేఎస్ ఇళంగోవన్, తిరునావుక్కరసర్, జ్యోతిమణి, కార్తీ చిదంబరం, విజయ్ వసంత్, పీటర్ అల్ఫోన్స్, సుదర్శన్ నాచియార్, చెల్లకుమార్, మాణిక్యం ఠాగూర్ సహా 31 మంది ఎన్నికల కమిటీలో చోటుచేసుకున్నారు.

కూలిన ఆదంబాక్కం ఎమ్మార్టీఎస్ ఫ్లై ఓవర్



వేళచ్చేరి, జనవరి 18: స్థానిక ఆదంబాక్కంలో నిర్మిస్తున్న ఎమ్మార్టీఎస్ ఫ్లై ఓవర్ గురువారం సాయంత్రం కూలింది. వేళచ్చేరి నుంచి సెయింట్ థామస్ మౌంట్ వరకు 5 కి.మీ దూరం ఎమ్మార్టీఎస్ రైలు సేవలు పొడిగించేలా స్తంభాలపై రైలు మార్గం పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో, ఆదంబాక్కం తిల్లై గంగా నగర్ ప్రాంతంలో రెండు స్తంభాల మధ్యలో ఉంచిన 80 అడుగుల దిమ్మె హఠాత్తుగా కూలిపడింది. ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదని సమాచారం. ఈ ఘటనలో ఆదంబాక్కం పోలీసులు ఘటనపై కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు. కాగా, ఫ్లై ఓవర్ నిర్మాణం కారణంగా ఈ మార్గంలో వాహనాల రాకపోకలు నిలిపివేయడంతో పెనుప్రమాదం తప్పిందని పోలీసులు పేర్కొన్నారు.

నేడు గణతంత్ర వేడుకల రిహార్సల్స్

పెరంబూర్, జనవరి 18: గణతంత్ర వేడుకల తొలివిడత రిహార్సల్స్ శుక్రవారం జరుగనున్నాయి. స్థానిక మెరీనా తీరం సమీపంలోని కార్మికుల స్మారక చిహ్నం వద్ద జరిగే ఈ రిహార్సల్స్‌లో త్రిదళాలు, ఎన్‌సీసీ క్యాడెట్లు, పోలీసు, ట్రాఫిక్ సహా పలు విభాగాలకు చెందిన వారు పాల్గొంటారని సచివాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

రాష్ట్రానికి 2.76 టీఎంసీల జలాల విడుదల

● కావేరి నిర్వాహక మండలి ఉత్తర్వులు

ప్యారీస్, జనవరి 18: రాష్ట్రానికి 2.76 టీఎంసీల జలాలను విడుదల చేయాలంటూ కావేరి నిర్వాహక మండలి ఉత్తర్వులు జారీచేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఏర్పాటైన కావేరి నిర్వాహక మండలి, కావేరి ట్రిబ్యునల్‌లు ప్రతినెలా సమావేశమై కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల మధ్య వివాదాస్పదమైన కావేరి జలాల సమస్యపై చర్చించి పరిష్కరింపజేసే చర్యలు చేపడుతున్నాయి. ఆ రీతిలో గత అక్టోబరు 30వ తేది కావేరి నిర్వాహక మండలి సమావేశమై రాష్ట్రానికి నవంబరు 23వ తేది వరకు సెకనుకు 2,600 ఘనపుటడుగుల నీరు విడుదల చేయాల్సిందిగా కర్ణాటక ప్రభుత్వానికి ఆదేశించింది. ఆ తర్వాత రాష్ట్రంలో ఈశాన్య రుతుపవనాల సీజన్ ప్రారంభం కావడంతో వర్షాలు భారీగా కురిశాయి. అందువల్ల రాష్ట్రానికి నీటి అవసరం లేకపోయింది. ఈ నేపథ్యంలో, గురువారం మళ్లీ ఢిల్లీలో కావేరి నిర్వాహక మండలి సమావేశం జరిగింది. అందులో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తమిళనాడు, కేరళ, కర్ణాటక, పుదుచ్చేరి రాష్ట్రాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఆమోదించిన తీర్మానం ప్రకారం, రాష్ట్రానికి 2.76 టీఎంసీల నీరు విడుదల చేయాలని మండలి ఛైర్మెన్ వినీత్‌గుప్తా కర్ణాటక ప్రభుత్వాన్ని ఆదేశించినట్లు కావేరి సాంకేతిక తనిఖీ ఛైర్మెన్ సుబ్రమణియన్ తెలిపారు.

ఏడేళ్ల తరువాత కొడనాడుకు శశికళ


కొడనాడు ఎస్టేట్‌లో జయలలితతో శశికళ (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, జనవరి 18: జయలలిత మృతి అనంతరం (ఏడేళ్ల తర్వాత) తొలిసారిగా శశికళ కొడనాడు వెళ్లనున్నారు. నీలగిరి జిల్లా కొడనాడులో జయలలితకు చెందిన బంగ్లాలో 2017వ సంవత్సరంలో హత్య, దోపిడీ సంఘటనలు జరిగాయి. ఈ కేసులో జయలలిత కారు డ్రైవర్ కనకరాజ్, సయాన్, వాలైయార్ మనోజ్, జిజిన్, దీపు, జంషీర్ సహా 11 మందిని నీలగిరి జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసును సీబీసీఐడీ పోలీసులు విచారిస్తున్నారు. ఈ నేపథ్యంలో, ఏడేళ్ల అనంతరం నీలగిరి జిల్లా కొడనాడు ఎస్టేట్‌కు శశికళ గురువారం సాయంత్రం వెళ్లారు. రాత్రికి ఎస్టేట్‌లో బసచేయనున్న శశికళ, శుక్రవారం ఉదయం బంగ్లా ప్రాంగణంలో జయలలిత విగ్రహం ఏర్పాటుకు భూమి పూజలో పాల్గొననున్నారు. అనంతరం తన మద్దతుదారులతో శశికళ సమావేశం కానున్నారు. ఈనెల 24న జయలలిత విగ్రహాన్ని శశికళ ఆవిష్కరించనున్నారు. 2016లో జరిగిన శాసనసభ ఎన్నికల అనంతరం జయలలిత, శశికళ కొడనాడు ఎస్టేట్‌కు వెళ్లారు. 2017లో కొడనాడు బంగ్లాలో హత్య, దోపిడి జరిగిన అనంతరం ఈ ప్రాంతానికి శశికళ వెళ్లడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

విద్యార్థి మృతి.. కండక్టర్ అరెస్టు

ప్యారీస్, జనవరి 18: చెన్నై మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ బస్సులో ఫుట్‌బోర్డులో నిలబడి ప్రయాణం చేస్తూ జారిపడిన విద్యార్థి మరణించిన కేసులో నాలుగు రోజుల అనంతరం ఆ బస్సు కండక్టరును అరెస్ట్ చేశారు. కొరుక్కుపేటకు చెందిన విశాల్ (14) పటేల్ నగర్‌లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. ఈ నెల 13న తండయార్‌పేట నుంచి సిటీ బస్సులో పాఠశాలకు వెళ్లాడు. ఆ బస్సు పవర్ హౌస్ బస్టాపు నుంచి బయల్దేరుతుండగా ఫుట్‌బోర్డుపై నిల్చున్న విశాల్ హఠాత్తుగా కిందకు జారి బస్సు చక్రంలో చిక్కుకొని అక్కడికక్కడే మృతిచెందాడు. విద్యార్థి తండ్రి చంద్రన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆర్కే నగర్ పోలీసులు కండక్టర్ అన్బళగన్‌ను అరెస్ట్ చేశారు.

భార్యను హతమార్చి వృద్ధుడి ఆత్మహత్య

ప్యారీస్, జనవరి 18: తిరునల్వేలి జిల్లా కూడన్‌కుళంలో 75 ఏళ్ల భార్యను కత్తితో పొడిచి చంపిన 80 ఏళ్ల వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కూడన్‌కుళం ప్రాంతానికి చెందిన ఎడ్వర్డ్ (80)-సౌందర్యవల్లి (75) దంపతులు మనస్పర్థల కారణంగా పదేళ్లుగా వేర్వేరుగా ఉంటున్నారు. ఇటీవల వారి కుమారులు, కుమార్తెలు తల్లిదండ్రులు కలిసి ఉండేట్లు ఒప్పించారు. ఈ నేపథ్యంలో, భార్యాభర్తల మధ్య గురువారం ఉదయం మళ్లీ గొడవలు చెలరేగడంతో ఆగ్రహం చెందిన ఎడ్వర్డ్ కత్తితో భార్యపై దాడిచేయడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. అనంతరం ఎడ్వర్డ్ కూడా ఇంటి ప్రాంగణంలో ఉన్న చెట్టుకు ఉరేసుకొని మృతిచెందాడు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

పీఈటీ దారుణహత్య

అడయార్, జనవరి 18: కడలూరు జిల్లా చిదంబరం సమీపంలోని అన్నామలై నగర్‌లో ఓ పీఈటీ దారుణ హత్యకు గురయ్యాడు. మృతుడిని అరుణ్‌పాండ్యన్ (28)గా గుర్తించారు. పాత కక్షల కారణంగా ఈ హత్య జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ టీచర్‌ను తల, మొండెంలను వేరు చేసి అతి కిరాతకంగా హత్య చేశారు. స్థానిక పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పంచనామా నిమిత్తం ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

10 నిమిషాల్లో కేజీ చిల్లీ చికెన్ హాం ఫట్

అడయార్, జనవరి 18: సంక్రాంతి సందర్భంగా పలు గ్రామాల్లో వివిధ రకాల పోటీలను నిర్వహించారు. ఇందులో భాగంగా, ధర్మపురి జిల్లా ముక్కల్‌నాయకన్‌పట్టిలో విచిత్ర పోటీలను నిర్వహించారు. ఒక కేజీ బిర్యానీ, ఒక కేజీ చిల్లీ చిక్కెన్ అతి తక్కువ సమయంలో ఆరగించే పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో యువకులు అమితాసక్తితో పాల్గొన్నారు. బిర్యానీ ఆరగించే పోటీల్లో పది మంది మహిళలు పాల్గొన్నారు. ఇందులో షాలిని (27) అనే మహిళ కేజీ బిర్యానీ అతి తక్కువ సమయంలో ఆరగించి మొదటి బహుమతి గెలుచుకున్నారు. అలాగే, కేజీ చిల్లీ చికెన్‌ను పది నిమిషాల్లో పచ్చియప్పన్ (20) అనే రైతు ఆరగించాడు. అదేవిధంగా 2 లీటర్ల కూల్‌డ్రింక్‌ను రాజ్‌కుమార్ (22) అనే కార్మికుడు 5 నిమిషాల్లో తాగి మొదటి బహుమతులను గెలుచుకున్నారు.

విద్యార్థినులపై లైంగిక వేధింపులు... పాఠశాల ప్రిన్సిపాల్ అరెస్టు

ప్యారీస్, జనవరి 18: విల్లుపురం జిల్లా దిండివనం సమీపంలో పాఠశాల విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు వచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఆ పాఠశాల ప్రిన్సిపాల్‌ను గురువారం పోలీసులు అరెస్ట్ చేశారు. దిండివనం సమీంపలోని సీబీఎస్ఈ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని పట్ల ప్రిన్సిపాల్ కార్తికేయన్ లైంగిక వేధింపులకు పాల్పడ్డారని గత ఏడాది అక్టోబరులో విద్యార్థి తల్లిదండ్రులు విల్లుపురం మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసిన పోలీసులు బాలిక వద్ద విచారణ జరిపిన అనంతరం గురువారం కార్తికేయన్‌ను అరెస్ట్ చేసి విల్లుపురం ప్రత్యేక పోక్సో కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు.

రోడ్డు పక్కన గోడను ఢీకొన్న బస్సు


● ప్రయాణికుల హాహాకారాలు



వేలాడుతున్న బస్సు

చెన్నై, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన కుముళి నుంచి కేరళలోని కొల్లం ప్రాంతానికి వెళ్తున్న బస్సు అదుపు తప్పి రహదారి ప్రహరీని ఢీకొట్టి బోల్తాపడకుండా వేలాడటంతో ప్రయాణికులు, స్థానికులు ఆందోళనకు గురయ్యారు. కేరళ రాష్ట్ర రవాణా సంస్థకు చెం దిన బస్సు 43 మంది ప్రయాణికులతో కొల్లం వెళ్తూ వండిపెరియారు జాతీయ రహదారిలో 56వ మైలు ప్రాంతంలోని అయ్యప్ప కళాశాల సమీపంలో హఠాత్తుగా అదుపుతప్పి రహదారిలో ప్రహరీని ఢీకొని దిగువ పడకుండా వేలాడింది. దీంతో ప్రయాణికులు పెట్టిన కేకలు విని స్థానికులు కెళ్లి వారిని కాపాడారు. ఆ బస్సు గనుక బోల్తాపడి ఉంటే ఆరడుగుల దిగువనున్న ఇల్లు ధ్వంసమై ఉండేది. ప్రహరీపై వేలాడుతున్న బస్సును భారీ క్రేన్ ద్వారా రహదారిపైకి ఎక్కించేందుకు ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపడుతున్నారు.

1,500 కిలోల గుట్కాతో ఐదుగురి అరెస్టు


గుట్కాతో పట్టుబడిన నిందితులు

ప్యారీస్, జనవరి 18: స్థానిక రెడ్‌హిల్స్ సమీపంలోని బుద్ధగరం ప్రాంతంలో ఉన్న గోడౌనుకు మినీ లారీలో తరలించిన 1,500 కిలోల గుట్కా పదార్థాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు ఐదుగురిని అరెస్ట్ చేశారు. పుళల్ పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుళ్లు వెంకటేశ్ పెరుమాళ్, కార్తికేయన్ నేతృత్వంలో బుద్ధగరం ప్రాంతంలోని జాతీయ రహదారిలో బుధవారం రాత్రి వాహనాలతనిఖీ చేపట్టారు. ఆ సమయంలో ఓ గోదాము ముందు నిలిపిన మినీ లారీ నుంచి కొందరు కార్మికులు బస్తాలు దించుతుండడం గుర్తించిన పోలీసులు అక్కడకెళ్లి ప్రశ్నించారు. అయితే అక్కడున్న వారు పొంతన లేని సమాధానాలివ్వడంతో అనుమానంతో బస్తాలు తనిఖీ చేసి, వాటిలో గుట్కా, హాన్స్ తదితర పొగాకు ఉత్పత్తులను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో గోదాము యజమాని కరుక్కువేల్, అయ్యాదురై, చిన్నతంబి, జయశీలన్, ఆనంద రమేష్‌లను అరెస్ట్ చేసి విచారణ చేపట్టారు.

2024లో నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలయ్యే చిత్రాలివే

ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫాం నెట్ ఫ్లిక్స్ 2024లో స్ట్రీమింగ్ కానున్న కొత్త చిత్రాల జాబితాను వెల్లడించింది. మొత్తం 9 కొత్త తమిళ చిత్రాలను విడుదల చేయనుంది. దేశంలోని ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్స్‌లో ఒకటైన నెట్‌ఫ్లిక్స్.. 2024లో విడుదలయ్యే అనేక కొత్త చిత్రాల డిజిటల్ రైట్స్‌ను సొంతం చేసుకుంది. వీటిని థియేటర్‌లో రిలీజ్ అయిన తర్వాత ఓటీటీలో స్ట్రీమింగ్ చేసేలా ఒప్పందం కుదుర్చుకుంది. ఈ తొమ్మిది చిత్రాల్లో అజిత్ నటించే 'విడాముయర్చి', కమల్ 'ఇండియన్-2', 'కాంజురింగ్ కణ్ణప్పన్', 'కన్నివెడి', 'మహారాజా', 'శివకార్తికేయన్ 21', 'సొర్గవాసల్', 'తంగలాన్' వంటి చిత్రాలున్నాయి. వీటిని తమిళంతో పాటు తెలుగు, మలయాళం, కన్నడ భాషలకు సంబంధించి డిజిటల్ రైట్స్‌ను సొంతం చేసుకుంది. గత యేడాది నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అయిన 'లియో', 'తుణివు', 'మామన్నన్' తదితర సినిమాలను స్ట్రీమింగ్ చేసి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులకు వినోదాన్ని పంచింది. ఫలితంగా నెట్‌ఫ్లిక్స్ గత యేడాది దక్షిణ భారత సినిమా కంటెంట్‌లో 50 శాతం వృద్ధి సాధించింది. ఈ యేడాది మరికొన్ని కొత్త చిత్రాల స్ట్రీమింగ్‌లో మరింతగా ప్రేక్షకుల్లో చొచ్చుకుపోయేలా ప్రయాణికులు రూపొందించింది.


'ఇండియన్-2'లో కమల్ హాసన్

ప్రేక్షకుల అభిరుచి మారలేదు

● దర్శకుడు ఎళిల్ ● 27న 'ఎళిల్25' సెలెబ్రేషన్స్



డిజిటలీకరణ కాలంలోనూ ప్రేక్షకుల అభిరుచి ఏమాత్రం మారలేదని ప్రముఖ దర్శకుడు ఎళిల్ అన్నారు. మంచి కంటెంట్‌తో వచ్చే చిత్రాలను ప్రేక్షకులు ఎన్నటికీ ఆదరిస్తూనే ఉంటారని ఆయన పేర్కొన్నారు. అయితే, పాటల కంపోజింగ్‌లో మార్పులు వచ్చినప్పటికీ.. పాత పాటలను ఇప్పటికీ శ్రద్ధగా ఆలకించేవారున్నారని, అలాంటి పాటలను కంపోజింగ్ చేసేవారే ఇపుడు లేరని గుర్తుచేశారు. ఈయన చిత్రపరిశ్రమలోకి దర్శకుడిగా పరిచయమై 25 యేళ్ళు దీన్ని పురస్కరించుకుని 'ఎళిల్-25' పేరుతో ఈ నెల 27వ తేదీ వేడుకలు జరుగనున్నాయి. ఆ రోజు తాను తెరకెక్కిస్తున్న 'దేశింగురాజా-2' చిత్రం ఫస్ట్ లుక్ రిలీజ్ చేయనున్నట్టు ఆయన తెలిపారు. వడపళనిలోని గ్రీన్ పార్క్ హోటల్‌లో జరిగే ఈ వేడుకలను సీనియర్ నిర్మాత ఆర్.బి.చౌదరి ప్రారంభించనున్నారు. ఈ వేడుకలను పురస్కరించుకుని ఆయన మీడియాతో మాట్లాడుతూ, 'నాకు తొలిసారి దర్శకుడిగా అవకాశం ఇచ్చింది ఆర్బీ చౌదరి. అందుకే ఆయన చేతుల మీదుగా ఈ వేడుకలను ప్రారంభించాలని నిర్ణయించాం. నేను దర్శకత్వం వహించిన చిత్రాలకు పనిచేసిన నటీనటులు, సాంకేతిక నిపుణులందరినీ ఈ వేడుకలకు ఆహ్వానిస్తున్నాం. వీరిలో హీరోలు విజయ్, శివకార్తికేయన్, అజిత్, ప్రభుదేవా, జయం రవి, విమల్, విక్రమ్ ప్రభు, విష్ణు విశాల్, ఉదయనిధి, గౌతమ్ కార్తీక్ ఇలా అందరికీ ఆహ్వానం పంపుతాం. ఈ నెల 29వ తేదీకి నేను దర్శకత్వం వహించిన తొలి చిత్రం 'తుల్లాద మనముం తుల్లుం' విడుదలై 25 యేళ్ళు పూర్తవుతుంది. అందుకే 'ఎళిల్-25' పేరుతో వేడుకలను నిర్వహించేలా నిర్మాత ఇన్ఫినిటీ క్రియేషన్స్ పి.రవీంద్రన్ ప్లాన్ చేశారు' అని వివరించారు.

చిత్రజ్యోతి

మంచి కథలకే ప్రేక్షకుల ఆదరణ

● హీరో అరుణ్ విజయ్



'థ్యాంక్స్ గివింగ్ మీట్'లో చిత్ర బృందం

మంచి కథలకు ప్రేక్షకుల నుంచే కాకుండా మీడియా నుంచి ఆదరణ లభిస్తుందని, అలాంటి ఆదరణ తాను నటించిన 'మిషన్ చాప్టర్-1'కు లభించిందని హీరో అరుణ్ విజయ్ అన్నారు. లైకా ప్రొడక్షన్స్ నిర్మాణంలో ఏఎల్.విజయ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఈ నెల 12న సంక్రాంతి సందర్భంగా విడుదలై పాజిటివ్ టాక్ సొంతం చేసుకుంది. అమీ జాక్సన్, నిమిషా సజయన్ హీరోయిన్లు. చిత్ర బృందం బుధవారం ఏర్పాటు చేసిన థ్యాంక్స్ గివింగ్ మీట్‌లో హీరో అరుణ్ విజయ్ మాట్లాడుతూ తాను నటించే ప్రతి సినిమాకు ఏదో ఒక సమస్య ఉత్పన్నమవుతూనే ఉందని, సాంకేతికపరంగానే కాకుండా, శారీరకంగా కూడా సమస్యలు ఎదురయ్యాయన్నారు. ప్రస్తుతం ఈ సినిమాకు వస్తున్న పాజిటివ్ టాక్ ఆ కష్టాలు మరిచిపోయేలా చేసింది. చెన్నైలోనే కాదు, మదురై, పుదుచ్చేరి ఇలా ప్రతిచోటా ప్రేక్షకులు తమ కుటుంబాలతో వచ్చి చూస్తున్నారు. రోజురోజుకూ స్క్రీన్‌ల సంఖ్య పెరుగుతున్నాయి. తనపై నమ్మకంతో రూ.25 కోట్లు ఖర్చుపెట్టిన నిర్మాతలకు ఆయన కృతజ్ఞతలు' తెలిపరు. దర్శకుడు ఏఎల్ విజయ్ మాట్లాడుతూ, 'మా అందరికీ శుభ సంవత్సరం. సంక్రాంతికి విడుదలై సక్సెస్ సాధించిన చిత్రాల్లో మా సినిమా ఒకటి. చాలా సంతోషంగా ఉంది. భారీ బడ్జెట్ మూవీకి పూర్తి అన్ని విధాలుగా అండగా ఉన్న నిర్మాతలకు ధన్యవాదాలు. సినిమాకు ప్రధానం కథ. మంచి కంటెంట్ ఉన్న చిత్రాలు ఎన్నడూ నిరాశపరిచింది లేదు. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం ఈ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్ళింది' అని అన్నారు.అలాగే, ఇతర యూనిట్ సభ్యులు కూడా మాట్లాడారు.

'వడకుపట్టి రామస్వామి'పై ఎలాంటి వివాదం లేదు


'వడకుపట్టి రామస్వామి'లో సంతానం - మేఘా ఆకాష్

● దర్శకుడు కార్తీక్ యోగి

హాస్య నటుడు సంతానం హీరోగా రూపుదిద్దుకున్న 'వడకుపట్టి రామస్వామి' చిత్ర కథలో ఎలాంటి వివాదం లేదని ఆ చిత్ర దర్శకుడు కార్తీక్ యోగి తెలిపారు. వచ్చే నెల రెండో తేదీ ఈ చిత్రం విడుదలకానున్న నేపథ్యంలో ప్రమోషన్ కార్యక్రమాలను ప్రారంభించారు. ఇప్పటికే ఈ చిత్రం ట్రైలర్ విడుదలై పెను వివాదానికి దారితీసింది. ఈ ట్రైలర్‌లో 'నేను ఆ రామస్వామి'ని కాదంటూ హీరో చెప్పే డైలాగ్ చర్చకు తెరలేపింది. ఈ నేపథ్యంలో ఈ చిత్ర దర్శకుడు గురువారం నగరంలో మీడియాతో మాట్లాడుతూ, 'నా తొలి చిత్రం 'డిక్కీలూనా' హీరో సంతానం. ఇపుడు రెండో చిత్రాన్ని కూడా సంతానంతోనే నిర్మించాను. 1974 బ్యాక్‌డ్రాప్‌లో సాగుతుంది. ఒక గ్రామంలో కండ్ల కలక (మద్రాస్ ఐ) వస్తుంది. దీన్ని ఈ గ్రామానికి చెందిన రామస్వామి అనే యువకుడు ఎలా తనకు అనుకూలంగా మలచుకున్నాడన్నదే కథ. పూర్తి హాస్యభరితంగా సాగుతుంది. నిళల్‌గల్ రవి పాత్ర సినిమాలో ట్విస్ట్. హీరోయిన మేఘా ఆకాష్ ఆర్మీలో పనిచేసే వైద్యురాలి పాత్ర పోషించారు. పళని, దిండిగల్, మదురై తదితర ప్రాంతాల్లో షూటింగ్ చేశాం. ఖర్చు ఎక్కువ కావడంతో తెలుగులో అనేక విజయవంతమైన చిత్రాలను నిర్మించిన నిర్మాత టీజీ విశ్వప్రసాద్‌ను సంప్రదించగా, స్టోరీ విన్న వెంటనే ప్రాజెక్టు చేసేందుకు అంగీకరించారు. అలా మొదలైన ఈ సినిమా వచ్చే నెల రెండో తేదీ విడుదలకు సిద్ధంగా ఉంది. రామస్వామి అనే డైలాగ్‌లో ఎలాంటి వివాదం లేదు. సినిమా చూస్తే మీకే తెలుస్తుంది. ఇందులోని ఓ పాటను సంతానం స్వయంగా ఆలపించారు. ఇలాంటి అనేక ఆసక్తికర అంశాలు చిత్రంలో ఉన్నాయి. 'డిక్కీలూనా' టైమ్ ట్రావెల్ జోనర్‌లో సాగుతుంది. ఈ సినిమా పూర్తిగా గ్రామీణ నేపథ్యంలో 1974 నేపథ్యంలో సాగే కథ. కుటుంబంతో కలిసి ఎంజాయ్ చేసేలా ఉంటుంది' అని వివరించారు. కాగా, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానరుపై నిర్మించిన ఈ చిత్రంలో సంతానం, మేఘా ఆకాష్, నిళల్‌గల్ రవి, ఎంఎస్.భాస్కర్, మారన్, తమిళ్ తదితరులు నటించగా సేన్ రోల్డన్ సంగీతం సమకూర్చారు.

నాగరాజాలయంలో తైమాస ఉత్సవాల ప్రారంభం


ధ్వజారోహణం చేస్తున్న తంత్రీ నాగరాజన్ నంబూద్రి

చెన్నై, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి జిల్లా నాగర్‌కోవిల్‌లోని సుప్రసిద్ధ నాగరాజస్వామివారి ఆలయంలో తైమాస ఉత్సవాలు ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. వేద పండితుల మంత్రోచ్చారణ, మంగళవాయిద్యాల నడుమ తంత్రీ నాగరాజన్ నంబూద్రి ధ్వజారోహణం చేశారు. ఆ తర్వాత ధ్వజస్తంభానికి దీపారాధన, ప్రత్యేక పూజలు జరిపారు. ఈ వేడుకల్లో ఎంపీ విజయ్‌వసంత్, మేయర్ మహేష్, ఎమ్మెల్యే ఎంఆర్ గాంధీ, తిరుప్పూరు సౌత్ ఎమ్మెల్యే సెల్వరాజ్, ట్రస్టు బోర్డు చైర్మన్ ప్రభా రామకృష్ణన్, స్వామి పద్మేంద్ర, నాగర్‌కోవిల్ కార్పొరేషన్ కౌన్సిలర్లు అక్షయా కన్నన్, రేచిట్టా తిరుమాళ్ తదితరులు పాల్గొన్నారు.

పుదువైలో 'వండర్స్ ఆఫ్ వైట్ టౌన్' మ్యూజియం

● ప్రారంభించిన సీఎం రంగస్వామి


ఆర్టిస్ట్ ఏపీ శ్రీధర్‌ను అభినందిస్తున్న సీఎం తదితరులు

పుదుచ్చేరి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ చిత్రకారుడు ఏపీ శ్రీధర్‌కు చెందిన మ్యూజియంను పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి ప్రారంభించారు. ఈ మ్యూజియం రాష్ట్రానికి ఒక కొత్త ల్యాండ్ మార్క్‌గా ఉంటుందని ఆయన ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. 'వండర్స్ ఆఫ్ వైట్ టౌన్' రాష్ట్ర పర్యాటక రంగ అభివృద్ధికి ఊతమిస్తుందని, పుదుచ్చేరిలో అందాలు తిలకించేందుకు వచ్చే పర్యాటకులు కూడా ఈ మ్యూజియాన్ని సందర్శించవచ్చని ఆయన అన్నారు. కాగా, ఏపీ శ్రీధరన్ తన కళానైపుణ్యంతో నిర్మించిన ఈ మ్యూజియంలో వింటేజ్ కెమెరా, క్లిక్ ఆర్ట్, త్రీడీ డ్రాయింగ్, వ్యాక్స్ ప్రతిమలతో పాటు అనేకం ఉన్నాయి. ఈ మ్యూజియం వ్యవస్థాపకుడు ఏపీ శ్రీధర్‌ను ప్రత్యేకంగా అభినందించిన ముఖ్యమంత్రి రంగస్వామి మాట్లాడుతూ, ఈ మ్యూజియంలోని నాయకుల సిలికాన్ విగ్రహాలను ప్రత్యేక పద్ధతిలో తయారు చేశారన్నారు. ఇలాంటి మ్యూజియంను మన రాష్ట్రంలో ఏర్పాటు చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పర్యాటకులు, విద్యార్థులు, చిన్నారులు కూడా దీన్ని సందర్శించేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ శ్రీధర్‌తో పాటు మ్యూజియం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

'పూర్వ సౌఖ్యం' ప్రాజెక్టు ప్రారంభం



మీడియా సమావేశంలో పురవంకర ప్రతినిధులు

అడయార్, జనవరి 18: దేశంలో అత్యంత నమ్మకమైన రియల్ ఎస్టేట్ డెవలపర్ కంపెనీల్లో ఒకటైన పురవంకర లిమిటెడ్ తన సరికొత్త ప్రాజెక్టును చెన్నై నగరంలో ప్రారంభించింది. 'పూర్వ సౌఖ్యం' పేరుతో చేపట్టిన ఈ ప్రాజెక్టును నగర శివారు ప్రాంతమైన గూడువాంజేరిలో ప్రారంభించారు. మొత్తం 120 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్టును తొలి దశలో అభివృద్ధి చేయనున్నారు. ఇందులో 600 నుంచి 2200 చదరపు టడుగుల విస్తీర్ణంలో ప్లాట్లను నిర్మించే ఈ ప్రాజెక్టులో దాదాపు 35 రకాల సౌకర్యాలను కల్పించనున్నారు. 30 వేల చదరపు అడుగుల క్లబ్‌హౌస్, వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని 80 శాతం ప్లాట్లను 800 నుంచి 1800 చదరపుటుడుగుల విస్తీర్ణంలో ఉంచారు. ఈ ప్రాజెక్టు ప్రారంభోత్సవం సందర్భంగా పురవంకర గ్రూపు సీఈవో అభిషేక్ కపూర్ మాట్లాడుతూ, 'పూర్వ సౌఖ్యం నివాసితులకు సౌకర్యవంతమైన, సమతుల్య జీవనశైలి అందించేలా ఈ ప్రాజెక్టును చేపట్టినట్టు పేర్కొన్నారు. కరోనా మహమ్మారి తర్వాత దేశంలో రియల్ ఎస్టేట్ రంగం ఒక క్రమ పద్ధతిలో పురోగమిస్తుందని ఆయన వివరించారు.

బజార్ బ్రాండ్ అంబాసిడర్‌గా చెఫ్ దాము



అడయార్, జనవరి 18: ఆతిథ్య రంగంలో శ్రేష్ఠమైన హోటళ్ళలో ఒకటిగా గుర్తింపు పొందిన జీఆర్‌టీ హోటల్స్ ప్రముఖ పాకశాస్త్ర నిపుణుడు డాక్టర్ దాముతో ఒక దృఢమైన, శాశ్వతమైన అనుబంధాన్ని కొనసాగించనుంది. ఇందులోభాగంగా, జీఆర్‌టీ హోటల్ ఫ్లాగ్‌షిప్ ఔట్‌లెట్ అయిన బజార్‌కు 2024 సంవత్సరానికిగాను డాక్టర్ దాము బ్రాండ్ అంబాసిడర్‌గా నియమితులయ్యారు. ఈ బహుళ వంటకాల రెస్టారెంట్ గ్లోబల్ డైనింగ్‌కు మరింత ప్రాచూర్యం కలిగించేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకుంది. బజార్ బ్రాండ్ అంబాసిడర్‌గా డాక్టర్ దాము నియమితులు కావడం పాకశాస్త్రంలో సరికొత్త రుచులను ఆహార ప్రియులకు అందించేందుకు దోహదపడుతుందని వారు పేర్కొన్నారు. బజార్ బ్రాండ్ త్వరలోనే చెన్నైతో పాటు కాకినాడ, మదురై, విజయవాడ నగరాల్లో త్వరలో ప్రారంభించనున్న రెస్టారెంట్లను ఆయన సందర్శించనున్నారు.

నేటినుంచి 'ఖేలో ఇండియా'

స్టేడియంలో కొత్తగా ఏర్పాటు చేసిన ట్రాక్



● చెన్నై సహా 4 నగరాల్లో నిర్వహణ ● సత్తా చాటనున్న 6 వేల మంది క్రీడాకారులు
● వేడుకలకు సిద్ధమైన నెహ్రూ స్టేడియం ● ప్రారంభించనున్న ప్రధాని మోదీ


వేడుకలకు సిద్ధమైన నెహ్రూ స్టేడియం

చెన్నై, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 'ఖేలో ఇండియా' యువజన పోటీలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. గ్రామీణ యువతకు అవకాశాలు కల్పించి, వారిలోని క్రీడా ప్రతిభను వెలికితీసే దిశగా దేశంలోనే తొలిసారిగా 'ఖేలో ఇండియా' యువజన క్రీడలను 2018లో ప్రవేశపెట్టింది. తొలిసారిగా ఈ పోటీలు దేశ రాజధాని ఢిల్లీలో అట్టహాసంగా జరిగాయి. ఆ తర్వాత 2019లో మహారాష్ట్రలోని పూణేలో, 2020లో అసోం రాష్ట్రం గువాహటిలో నిర్వహించారు. 2021 హర్యానాలోని పంచకుల్లాలో జరగాల్సిన నాలుగో ఖేలో ఇండియా యువజన పోటీలు వాయిదాపడ్డాయి. అనంతరం 2022లో మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌లో ఈ పోటీలు జరిగాయి. ఈ నేపథ్యంలో ఆరవ ఖేలో ఇండియా యువజన పోటీలను నిర్వహించే అవకాశాన్ని రాష్ట్ర క్రీడా శాఖ దక్కించుకుంది. దక్షిణ భారతదేశంలో తొలిసారిగా అదీ తమిళనాట ఈ పోటీలను భారీ ఏర్పాట్ల నడుమ నిర్వహించేందుకు యువజన సంక్షేమ,క్రీడాభివృద్ధి శాఖల మంత్రి ఉదయనిధి స్టాలిన్ నెల రోజులకు పైగా సంబంధిత అధికారులతో కలిసి చర్యలు చేపట్టారు. ఈ పోటీలు శుక్రవారం ఉదయం ప్రారంభమై ఈ నెల 31తేదీతో ముగియనున్నాయి. చెన్నై, కోయంబత్తూరు, తిరుచ్చి, మదురై నగరాలలో ఒకే సమయంలో ఈ పోటీలు నిర్వహించనున్నారు.

ప్రారంభోత్సవం...

ఖేలో ఇండియా యువజన పోటీలు శుక్రవారం సాయంత్రం 6 గంటలకు ప్రారంభమవుతుంది. గవర్నర్ ఆర్ఎన్ రవి, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, కేంద్రమంత్రులు అనురాగ్ ఠాకూర్, నచిత్ ప్రమాణిక్ యువజ సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖల మంత్రి ఉదయనిధి సమక్షంలో ప్రధాని నరేంద్ర మోదీ పోటీలను ప్రారంభించనున్నారు. ఈ ప్రారంభోత్సవ వేడుక గంటకు పైగా కొనసాగుతుంది. ప్రస్తుతం నెహ్రూ స్టేడియం నలువైపులా పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు. అన్ని వైపులా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కంట్రోల్ రూమ్‌లో స్టేడియం పరిసరాల్లో జనాల కదలికపై పోలీసు ఉన్నతాధికారులు నిఘా వేస్తున్నారు. గుర్తింపు కార్డులు, ఆహ్వాన పత్రికలు ఉన్నవారినే స్టేడియంలోకి అనుమతిస్తామని పోలీసు అధికారులు తెలిపారు.

6వేల మంది క్రీడాకారులు...

18 ఏళ్లలోపు వారికి నిర్వహించే క్రీడా పోటీల్లో 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన ఆరువేల మందికి పైగా క్రీడాకారులు విచ్చేశారు. వీరితోపాటు సుమారు వెయ్యి మంది కోచ్‌లు కూడా నాలుగు నగరాలకు చేరుకున్నారు. 12 వేలమందికి పైగా స్వచ్ఛంద సేవకులు ఈ పోటీల్లో సేవలందిస్తున్నారు.

27 రకాల క్రీడలు...

ఈ పోటీల్లో అథ్లెట్, ఫుట్‌బాల్, కబడ్డీ, వాలీబాల్, హాకీ, వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్, రెఫిల్ షూటింగ్, టేబుల్ టెన్నిస్, టెన్నిస్, బాస్కెట్‌బాల్, జిమ్నాస్టిక్, జూడో, స్క్వాష్, ఆర్చరీ, బ్యాడ్మింటన్, ఫెన్సింగ్, స్విమ్మింగ్, సైక్లింగ్, రెజ్లింగ్, కోకో సహా 27 రకాల క్రీడాపోటీలను నిర్వహించనున్నారు. తమిళుల ప్రాచీన క్రీడ కర్రసాము (సిలంబాట్టవ్ం) కూడా చోటుచేసుకోనుంది.


17 క్రీడామైదానాలు..

చెన్నై సహా నాలుగు నగరాల్లో ఉన్న 17 స్టేడియంలలో ఈ పోటీలు జరుగనున్నాయి. వేప్పేరిలోని నెహ్రూ స్టేడియం, నెహ్రూ ఇండోర్ స్టేడియం, మద్రాసు వర్సిటీ క్రీడామైదానం, నెహ్రూ పార్క్, మేయర్ రాధాకృష్ణన్ స్టేడియం, రాజరత్నం స్టేడియం, అలమాదిలో ఉన్న డాక్టర్ పి.శివంది ఆదిత్యన్ షూటింగ్ రేంజ్, ఎస్డీఏటీ టెన్నిస్ స్టేడియం, స్విమ్మింగ్‌పూల్స్‌లో ఖేలో ఇండియా యువజన పోటీలు జరుగుతాయి. ఖోఖో, బాస్కెట్ బాల్ తదితర ఆరు పోటీలు తిరుచ్చి, మదురై, కోయంబత్తూరులో ఉన్న మూడు స్టేడియంలలో జరుగుతాయి. శుక్రవారం ప్రధాని నరేంద్రమోదీ ఈ పోటీలను ప్రారంభించనుండటంతో నెహ్రూ స్టేడియంను రాష్ట్ర క్రీడాభివృద్ధి సంస్థ (ఎస్డీఏటీ) అధికారులు అందంగా తీర్చిదిద్దారు. ప్రారంభోత్సవ వేడుకలు, ప్రధానమైన క్రీడాపోటీలు జరుగనున్న నెహ్రూ స్టేడియం పాత ట్రాక్‌లను తొలగించి కొత్త ట్రాక్‌లు నిర్మించారు. రాత్రివేళ క్రీడలు నిర్వహించడానికి అనువుగా స్టేడియంలో ఫ్లడ్‌లైట్స్ కూడా ఏర్పాటు చేశారు. ప్రేక్షకులందరికీ కొత్త కుర్చీలతో సీటింగ్ ఏర్పాట్లు చేపట్టారు. క్రీడా ఫలితాలను ఎప్పటికప్పుడు తెలుసుకునేలా డిజిటల్ స్కోర్ బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. ప్రారంభోత్సవాల కోసం స్టేడియంలో భారీ వేదిక కూడా సిద్ధం చేశారు.


స్టేడియం వద్ద కొత్తగా ఏర్పాటైన స్వాగత తోరణం

కబడ్డీ పోటీ...

ఖేలో ఇండియా యువజన క్రీడలలో భాగంగా గురువారం 'ఎ' కేటగిరిలో ఉన్న తమిళనాడు, హరియాణ కబడ్డీ జట్లు పోటీపడ్డాయి. ఏ కేటగిరిలో హరియాణా, తమిళనాడు, తెలంగాణా, మహారాష్ట్ర మహిళా కబడ్డీ జట్లు, బీ కేటగిరిలో బీహార్, పశ్చిమబెంగాల్, హిమాచల్ ప్రదేశ్, చండీఘర్ మహిళా కబడ్డీ జట్లున్నాయి. గురువారం సాయంత్రం తమిళనాడు, హరియాణా జట్లు, బిహార్- పశ్చిమబెంగాల్ జట్లు, మహారాష్ట్ర - తెలంగాణా జట్లు, హిమాచల్ ప్రదేశ్- చండీఘర్ జట్లు పోటీపడ్డాయి. రాష్ట్రానికి చెందిన మహిళా కబడ్డీ జట్టు 2020లో రజతపతకం, 2022లో కాంస్య పతకాన్ని గెలుచుకుంది. ప్రస్తుతం ఈ జట్టులో 12 మంది క్రీడాకారిణులుండగా వీరిలో 10 మంది కళాశాల విద్యార్థినులు, ఇరువురు పాఠశాల విద్యార్థినులు. ఈ జట్టుకు 'ధ్యాన్‌చంద్ అవార్డు' గ్రహీత కవితా సెల్వరాజ్ కోచ్‌గా వ్యవహరిస్తున్నారు.



రాష్ట్రంలో 90లక్షల అయోధ్య ఆహ్వానపత్రికల పంపిణీ

చెన్నై, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): అయోధ్య రామాలయ మహాకుంభాభిషేకం, ప్రాణ ప్రతిష్ఠ ఉత్సవాలకు సంబంధించి రాష్ట్రంలో ఇంటింటికీ ఆహ్వాన పత్రికలు అందజేసే కార్యక్రమం 90 శాతం మేర పూర్తయినట్లు వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ నేతలు తెలిపారు. రాష్ట్రంలో కోటి ఇళ్ళకు స్వయంగా వెళ్ళి ఆహ్వాన పత్రికలు పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటివరకూ 90 లక్షల ఇళ్లకు వెళ్ళి ఆహ్వాన పత్రికలు, శ్రీరాముడి అక్షింతలు, ప్రసాదం అందజేసినట్లు వివరించారు. మరో రెండు రోజుల్లోగా రాష్ట్రమంతటా 10 లక్షల కుటుంబాలకు ఆహ్వాన పత్రికలను పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

చెన్నై, అడయార్ సామాజిక ఆరోగ్యకేంద్రంలో నవజాత శిశువుల కోసం ఏర్పాటైన స్టెబిలైజేషన్ యూనిట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం, మేయర్ ఆర్ ప్రియ, ఎంపీ తమిళచ్చి తంగపాండ్యన్ ఎమ్మెల్యే హసన్ మౌలానా

